www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence 04.

### మాల్‌కు అవార్డు

రంగారెడ్డి జిల్లాలోని మాల్ గ్రామ పంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డు విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈసారి తెలంగాణ నుంచి ఈ ఒక్క గ్రామమే జాతీయ అవార్డుకు ఎంపికయ్యింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 24న బీహార్‌లోని మధుబనిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును పంచాయతీ కార్యదర్శి రాజు అందుకున్నారు. కొత్తగా క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డ్, ఆత్మనిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డ్, పంచాయత్ సామర్థ్య నిర్మాణ సర్వోత్తమ సంస్థ అవార్డ్ ప్రవేశపెట్టారు. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను అందజేస్తారు. ప్రథమ స్థానం రూ. కోటి, ద్వితీయ స్థానం రూ. 75 లక్షలు, తృతీయ స్థానం రూ. 50 లక్షల చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.

# ‘ఆరు సూత్రాల’ ఉల్లంఘన.. తెలంగాణలో ఆందోళన

## టీజీపీఎస్‌సీ గ్రూప్-2 పేపర్-4 (2024) ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు



**1. కింది వ్యాఖ్యల్లో సరైనది?**

ఎ) ప్రాంతీయ అసమానతలు, అభివృద్ధి ప్రత్యామ్నాయాలు అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1997, ఆగస్టు 16, 17 తేదీల్లో సెమినార్ నిర్వహించారు

బి) ప్రొ. కే జయశంకర్ ఈ సెమినార్‌ను ప్రారంభించారు

**సరైన సమాధానం: బి**

**వివరణ:** తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో క్రియాశీల పాత్ర పోషించిన సంస్థల్లో తెలంగాణ ఐక్యవేదిక ప్రధానమైనది.

- 1997, ఆగస్టు 14, 15 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో ప్రాంతీయ అసమానతలు-అభివృద్ధి ప్రత్యామ్నాయాలు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన సదస్సును ప్రొ. కే జయశంకర్ ప్రారంభించారు.
- ఈ సదస్సులో ప్రొ. జయశంకర్, కేశవరావు జాదవ్, గాదె ఇన్నయ్య, కే శ్రీనివాస్, ఘంటా చక్రపాణి, బియ్యాల జనార్దనరావు వంటి మేధావులు వివిధ రంగాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు.

**2. ఎవరి అధ్యక్షతన అఖిల భారత ప్రజాప్రతిఘటన ఫోరం వరంగల్ ప్రకటనను 1997లో ప్రకటించింది?**

1) ప్రొ. జీ హరగోపాల్ 2) ప్రొ. కే జయశంకర్

3) ప్రొ. ఎం కోదండరాం 4) ప్రొ. జీఎన్ సాయిబాబా

**సమాధానం: 4) ప్రొ. జీఎన్ సాయిబాబా**

**వివరణ:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో వరంగల్ డిక్లరేషన్ పాత్ర గణనీయంగా ఉంది.

- అఖిల భారత ప్రజాప్రతిఘటన వేదిక (ఆలిండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం) ప్రొ. జీఎన్ సాయిబాబా అధ్యక్షతన 1997, డిసెంబర్ 28, 29 తేదీల్లో హనుమకొండలో ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షల సదస్సు నిర్వహించారు.
- అప్పటి వరకు నిర్వహించిన ప్రధాన భువనగిరి, సూర్యాపేట సభల తీర్మానాలన్నింటిని క్రోడీకరించి 50 డిమాండ్లతో వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించారు.
- ఆంధ్ర ప్రాంతానికి చెందిన, వైకల్యంతో ఇబ్బందిపడుతున్న ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ సాయిబాబా తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు.

**3. కింది వాటిలో సరైనవి?**

ఎ) వరుసగా వచ్చిన ఆంధ్ర ప్రభుత్వాలు తెలంగాణలో నీటిపారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేశాయి

బి) నిరంతర కరువులు, దుర్భిక్షాలతో తెలంగాణ ప్రాంతం నష్టపోయింది

సి) మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 12 నుంచి 14 లక్షల మంది దేశంలోని ఇతర ప్రాంతాలకు వలసపోయారు

డి) రెండు ప్రాంతాల మధ్య అసమతుల్యతను ‘తెలంగాణ రాష్ట్రం-ఒక డిమాండ్’ అనే గ్రంథంలో కాళోజీ నారాయణరావు వివరించాడు

**సమాధానం: ఎ, బి, సి**

**వివరణ:** తెలంగాణ రాష్ట్రం-ఒక డిమాండ్ అనే పుస్తకాన్ని ప్రొ. కొత్తపల్లి జయశంకర్ సార్ రచించాడు. అందువల్ల ‘డి’ తప్పు.

- జయశంకర్ ‘తెలంగాణ రాష్ట్రం-ఒక డిమాండ్’ పుస్తకంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం న్యాయమైన, బలమైన వాదనను వినిపించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వ అధికారిక సమాచారం ఆధారంగా గణాంకాలతో సహా ఈ పుస్తకంలో వివరించాడు. జయశంకర్ వివరణలను ఆంధ్ర ప్రాంత మేధావులు, ప్రజలు అర్థం చేసుకోవడం గొప్ప పరిణామం.
- పెద్ద మనుషుల ఒప్పందం ద్వారా 1956లో తెలంగాణ ఆంధ్రతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. అప్పటి నుంచి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరంగా అనేక విధాలుగా దోపిడీకి గురైన తీరును వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ దేశ విభజన కాదని, ఇది ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆత్మగౌరవం, న్యాయం, సమానాభివృద్ధి కోసం సాగిన ఉద్యమాన్ని న్యాయబద్ధంగా సమర్థించడం, తెలంగాణ ప్రజల గౌరవానికి, స్వాభిమానానికి ప్రగతికి ఇది అవసరమని ఈ పుస్తకంలో వివరించాడు.

**4. తెలంగాణ మహాసభ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం ఏమిటి?**

1) కమ్యూనిస్టు తెలంగాణను ఏర్పాటు చేయడం

2) దళిత బహుజన తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేయడం

3) శాసనసభలో తెలంగాణ ప్రజలకు అధిక స్థానాలను డిమాండ్ చేయడం

4) ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేయడం

**సమాధానం: 2**

**వివరణ:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమంలో భాగంగా దళిత బహుజన అణగారిన కులాలను, తెగలను ఐక్యం చేస్తూ మారోజు వీరన్న దళిత బహుజన మహాసభను స్థాపించాడు.

- చిన్న రాష్ట్రాల ఏర్పాటు ద్వారానే దళిత, బహుజనులకు న్యాయం జరుగుతుందని భావించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అణగారిన వర్గాలను భాగస్వాములను చేసే లక్ష్యంతో అనేక సదస్సులు, సమావేశాలు మారోజు వీరన్న నిర్వహించాడు.
- నాటి ప్రభుత్వ నిర్బంధాల వల్ల మారోజు వీరన్న తెర వెనుక ఉండి 1997, ఆగస్టు 11న సూర్యాపేట సదస్సును నిర్వహించాడు. ఈ సదస్సుకు చెరుకు సుధాకర్ అధ్యక్షుడిగా, వీ ప్రకాశ్ కార్యదర్శిగా వ్యవహరించారు.
- భువనగిరి సభ తర్వాత గద్దర్‌పై కాల్పులు జరగడంతో తెలంగాణ గురించి ఎవరూ గొంతెత్తలేరు, గజ్జెకట్టి ఆడలేరని భావించిన నాటి ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ వేలాది గొంతుకలతో గర్జించింది సూర్యాపేట తెలంగాణ మహాసభ.
- ‘ధోకాతిన్న తెలంగాణ’ నినాదంతో తెలంగాణ మహాసభ సూర్యాపేట సదస్సు విజయవంతమైంది.
- సూర్యాపేట తెలంగాణ మహాసభ నిర్వహించిన బహిరంగ సభకు ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ జిల్లాల నుంచి మేధావులు, పాత్రికేయులు, వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా హాజరై సభను విజయవంతం చేశారు.

**5. ఆరుసూత్రాల పథకం ఉల్లంఘనలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జయభారత్ రెడ్డి కమిటీని నియమించింది. ఈ కమిటీల్లో మిగతా సభ్యులెవరు?**

1) గోవింద రాజన్, రామారావు

2) అర్జున రావు, రాధాకృష్ణ

3) గోపాల రావు, వాసుదేవన్

4) కమలనాథన్, ఉమాపతి రావు

**సమాధానం: 4) కమలనాథన్, ఉమాపతి రావు**

**వివరణ:** ప్రత్యేక తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నాయకులతో విస్తృతంగా చర్చించిన నాటి ప్రధాని ఇందిరా గాంధీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కేసీ పంత్ ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించి 1973, సెప్టెంబర్ 21న ప్రకటించారు.

- ఆరు సూత్రాల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆంధ్ర కాంగ్రెస్ కార్యాచరణ కమిటీ 1973, అక్టోబర్ 1న జై ఆంధ్ర ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించింది.
- 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆరు సూత్రాల పథకానికి రాజ్యాంగబద్ధత కల్పించారు. ఆరు సూత్రాల పథకం అమల్లోకి రావడంతో ముల్కీ నిబంధనలను రద్దు చేశారు.
- ఆరు సూత్రాల పథకంలో భాగంగా పార్లమెంట్ రూపొందించిన 32వ రాజ్యాంగ సవరణ చట్టం 1975, అక్టోబర్ 18న రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా అమల్లోకి వచ్చింది. దీన్నే రాష్ట్రపతి ఉత్తర్వులు (ప్రెసిడెన్షియల్ ఆర్డర్) (జీవోఎంఎస్ నంబర్ 674) అంటారు.
- ఆరు సూత్రాల పథకం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించారు. అయితే ఉద్యోగ నియామకాల విషయంలో తెలంగాణకు చెందిన 5, 6వ జోన్లలో సీమాంధ్ర ప్రాంతం నుంచి వేలాది మంది నిబంధనలకు విరుద్ధంగా నియమితులయ్యారు.
- తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం, ఇతర ఉద్యోగ సంఘాలు (1984) తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన నియామకాలు, పోస్టింగులు, ఉద్యోగాల కేటాయింపుల్లో జరుగుతున్న అన్యాయాలను అనేక సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తేవడంతో పాటు తెలంగాణ ప్రయోజనాలను సంరక్షించమని కోరాయి.
- ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి 1975 నుంచి 1984 మధ్యకాలంలో జరిగిన నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, నిబంధనల ప్రకారం జరిగాయా లేదా అనే విషయాన్ని పరిశీలించే ఉద్దేశంతో జయభారత్ రెడ్డి కన్వీనర్‌గా, కమలనాథన్, ఉమాపతి సభ్యులుగా త్రిసభ్య కమిటీని (ఆఫీసర్స్ కమిటీ) ఏర్పాటు చేసింది.
- 1981, జూన్ 30 నాటికి తెలంగాణ ప్రాంతంలో సుమారు 59 వేల మంది స్థానికేతరులు ఉన్నట్లు జయభారత్ రెడ్డి కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

**6. కింది వ్యాఖ్యలను పరిగణించండి?**

ఎ) 1986, మార్చి 31న జీవో 610 ని అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసింది

బి) ఆఫీసర్స్ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా జీవో 610 ని జారీ చేశారు

**సమాధానం: ఎ, బి సరైనవి కావు**

**వివరణ:** ఆఫీసర్స్ కమిటీ (జయభారత్ రెడ్డి కమిటీ) నివేదికను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి నాటి ప్రభుత్వం సుందరేషన్ కమిటీని ఏర్పాటు చేసింది.

- సుందరేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా 1985, డిసెంబర్ 30న జీవో నంబర్ 610ని రూపొందించారు.

**నోట్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ఉద్యోగాలను సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వారు అక్రమంగా పొందారని నాటి ప్రభుత్వం నియమించిన కమిటీలు ప్రభుత్వ సమాచారం ఆధారంగా పేర్కొనడాన్ని బట్టి పరిశీలిస్తే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఉద్యోగాలను కొల్లగొట్టిందని అర్థమవుతుంది. కాబట్టి ఈ నేపథ్యంలో పై రెండు ప్రశ్నలు రూపొందించారు.

**7. ఆరు సూత్రాల ప్రణాళికను వ్యతిరేకిస్తూ హోం శాఖ సహాయ మంత్రి కేసీ పంత్ సమక్షంలో సంతకం చేయడానికి నిరాకరించిన తెలంగాణ నాయకులను పేర్కొనండి?**

1) ఎస్‌బీ గిరి, జీఎస్ మేల్కోటే, మల్లికార్జున్, ఎంఎం హషీం

2) ఎస్ జైపాల్ రెడ్డి, ఏ రాజారాం, జీఎస్ మేల్కోటే, మల్లికార్జున్

3) మల్లికార్జున్, ఏ రాజారాం, జీఎస్ మేల్కోటే, ఎస్‌బీ గిరి

4) ఎంఎం హషీం, కే రాజమల్లు, జే చొక్కారావు, ఎస్‌బీ గిరి

**సమాధానం: 1**

**8. కింది వ్యాఖ్యలను పరిగణించండి?**

ఎ) తెలంగాణ ప్రాంతీయ కమిటీ స్థాపనను అధికరణ 371 సులభతరం చేసింది

బి) తెలంగాణ ఏర్పాటుకు అధికరణ 371 డి ఆటంకం అయ్యింది

**సమాధానం: ఎ**

**వివరణ:** అధికరణ 371 ప్రకారం రాష్ట్రపతి ది ఆంధ్రప్రదేశ్ రీజినల్ కమిటీ ఆర్డర్ 1958ని విడుదల చేశారు. ఈ ఆర్డర్ ప్రకారం తెలంగాణ ప్రాంతీయ కమిటీని ఏర్పాటు చేశారు కాబట్టి తెలంగాణ ప్రాంతీయ కమిటీ స్థాపనను అధికరణ 370 సులభతరం చేసింది అనే వ్యాఖ్య సరైనది.

- రాజ్యాంగ సవరణ 32 (1973) ద్వారా అధికరణ ‘371డి’ ని భారత రాజ్యాంగంలో కొత్తగా చేర్చారు. దీనికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డాయి.
- అధికరణ 371డి ద్వారా జోనల్ వ్యవస్థ, లోకల్ కేడర్లు, స్థానిక రిజర్వేషన్లు కల్పించారు. తెలంగాణ ఏర్పాటు సందర్భంలో ఈ అధికరణ కొంత వరకు న్యాయపరంగా, పరిపాలనాపరంగా సంక్లిష్టతను కలిగించింది. సుప్రీంకోర్టు ఈ అధికరణకు న్యాయబద్ధత కల్పించినందున రాష్ట్ర ఏర్పాటు సమయంలో దాన్ని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. రాష్ట్ర ఏర్పాటుకు పూర్తి అడ్డంకి మాత్రం కాలేదు.
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు రాజ్యాంగంలోని అధికరణ 3 ప్రకారం రాజకీయ ప్రక్రియ ద్వారా చేశారు.
- 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో పార్లమెంట్ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఆమోదించి అధికరణ 371డి లో అవసరమైన సవరణలు చేశారు. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అధికరణ 371డి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన సవాళ్లను కలిగించిందే కానీ అది అడ్డంకిగా లేదని చెప్పవచ్చు.

**9. కింది వ్యాఖ్యలను పరిగణించండి?**

ఎ) రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తర్వాత జే వెంగళరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు

బి) ప్రపంచ తెలుగు మహాసభలను 1975లో విజయవాడలో నిర్వహించారు

సి) 21 నెలల ఎమర్జెన్సీ సమయంలో ఎక్కువగా తెలంగాణలో జరిగిన బూటకపు ఎదురు కాల్పుల్లో ప్రభుత్వం 77 మంది నక్సలైట్లను చంపింది

డి) ఆంధ్ర ప్రాంతపు ప్రయోజనాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అన్ని రంగాల్లో తెలంగాణను బలహీనపరుస్తూ వచ్చింది

**సమాధానం: ఎ, సి, డి**

**వివరణ:** మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు 1975లో హైదరాబాద్‌లో నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియచెప్పడం, వీటి పరిరక్షణ కోసం ప్రపంచ దేశాల మద్దతు పొందడం కోసం ఈ మహాసభలను నిర్వహించారు.

- జై ఆంధ్ర ఉద్యమ నేపథ్యంలో 1973, జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. కేంద్ర ప్రభుత్వ జోక్యంతో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో 1973, డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో 1973, డిసెంబర్ 10న జలగం వెంగళరావు సీఎం అయ్యాడు.
- దేశంలో ఎమర్జెన్సీ కొనసాగిన 1975, జూన్ 25 నుంచి 1977, మార్చి 21 వరకు (21 నెలలు) మధ్యకాలంలో పౌరహక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనకు గురయ్యాయి. ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయని అనేక నివేదికలు పేర్కొన్నాయి.
- మానవ హక్కుల సంఘాలు, పాత్రికేయుల నివేదికల ప్రకారం సుమారు 77 మంది నక్సలైట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా నకిలీ ఎన్‌కౌంటర్లలో హత్య చేయబడ్డారు. ఈ ఎన్‌కౌంటర్లు ఎక్కువగా తెలంగాణ జిల్లాల్లో (వరంగల్, కరీంనగర్, నల్లగొండ) జరిగాయి. మీడియా నియంత్రణలో ఉండటం, న్యాయ మార్గాలను నిరోధించడం వల్ల ఈ సంఘటనలను అప్పట్లో సవాల్ చేయడం కష్టంగా మారిందన్న వాదన ఉంది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర ప్రాంత ప్రయోజనాలు మొదటి ప్రాధాన్యంగా పరిగణించారని తెలంగాణ సమాజం అనేక ఆధారాలతో నిరూపించింది. నీళ్లు, నిధులు, నియామకాల పరంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. ప్రొ. జయశంకర్ వంటి తెలంగాణ మేధావులు ప్రభుత్వ సమాచారం ఆధారంగా వెల్లడించారు. చివరకు తెలంగాణ సమాజం తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసం దశాబ్దాల పాటు చేసిన ఉద్యమాల ఫలితంగా 2014, జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు,
ఆర్గనైజింగ్ సెక్రటరీ
తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

